కబ్జా కోరల్లో కాలువ గట్లు

- ఇప్పటికే పంట బోదెల్లా చిక్కిన వైనం
- శివారు భూములకు సాగునీటి ఇక్కట్లు
- మండలంలో మూడు ప్రధాన, 69 పిల్ల కాలువలు


పెరవలిలో భూపయ్య కాలువ గట్టును ఆక్రమించి నిర్మించుకున్న గృహాలు


ఆక్రమణలతో బోదెలా మారిన అన్నవరప్పాడులో బ్రాంచ్ కెనాల్

పెరవలి: పంట కాలువ గట్లు ఆక్రమణలకు గురయ్యాయి. విశాలంగా ఉండాల్సిన కాలువలు కాస్తా పంట బోదెల్లా చిక్కిపోయాయి. ఫలితంగా పంటలకు నీరందక రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎక్కడికక్కడ గట్లను తొలచి పొలాల్లో కలుపుకున్నారు. ఇది సరిపోదన్నట్టు నడిచేందుకు కూడా వీల్లేకుండా కాలువ గట్లపై మొక్కలు నాటేశారు. మండలంలో ప్రధానంగా కాకరపర్రు, బ్యాంక్, నరసాపురం కాలువలు ఉన్నాయి. వాటికి అనుబంధంగా ఉన్న 69 పిల్ల కాలువల ద్వారా పంటలకు నీరందుతుంది. బ్రిటిష్ వారి హయాంలో ఈ కాలువల్లో పడవలపై రాకపోకలు సాగించేవారని వృద్ధులు చెబుతుంటారు. ఇంతటి విశాలమైన కాలువ గట్లను గత 15 ఏళ్లుగా దళారీలు యథేచ్ఛగా దోచేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మండలంలోని పంట కాలువల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

రాకపోకలకు ఇబ్బంది

కాకరపర్రు గ్రామం నుంచి ప్రారంభమయ్యే గరప కాలువ, పెరవలిలోని భూపయ్య కాలువ, కాపవరం కాలువ, ఖండవల్లిలోని నక్కల కాలువ, అన్నవరప్పాడులోని బ్రాంచ్ కెనాల్, పేకేరు కాలువ గట్లు అక్రమణల్లో చిక్కుకున్నాయి. ఈ గట్లపై కొన్నేళ్ల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా ఎదగడంతో గట్లపై రాకపోకలు సాగించేందుకు రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మల్లేశ్వరంలోని ఆచంట కాలువ, ముక్కామల చానెల్, కాపవరం కాలువ ఇలా ఒక్కటేమిటి కాలువ కనిపిస్తే చాలు గట్లను ఆక్రమించుకుని కుదిరితే పొలంలో కలిపేసుకుంటున్నారు. లేకపోతే ఆ స్థలంలో గృహాలు, పశువుల శాలలు నిర్మించుకుంటున్నారు. ఆక్రమణలతో నడిచి వెళ్లేందుకు కూడా అనువుగా లేనంత ఇరుకుగా కాలువ గట్లు మారిపోయాయని ఆయకట్టు శివారు రైతులు గగ్గోలు పెడుతున్నారు.

కాలువ గట్టే లే అవుట్‌కు రోడ్డు

మల్లేశ్వరంలో పేకేరు కాలువ గట్టు వెంబడి అక్రమ లేఅవుట్ వేశారు.ఈ లేఅవుట్‌కు పేకేరు కాలువ గట్టుపైనే రోడ్డు వేసేశారు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు కిమ్మనక పోవడం పట్ల పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. భూపయ్య కాలువ గట్టు రెండింటినీ కొందరు ఆక్రమించుకుని ఏకంగా ఇళ్లు నిర్మించేసుకున్నారు. ఫలితంగా కాలువ కుచించుకుపోయి, నీటి ప్రవాహం తగ్గిపోయింది. మరో పక్క కాపవరం వెళ్లే కాలువను వ్యర్థాలతో నిండిపోతోంది. దాంతో ఏటా రైతులే ఈ కాలువను శుభ్రం చేసుకుంటున్నారు. పదేళ్ల క్రితం వరకూ ఈ గట్లపై ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా పంట ఉత్పత్తులను తీసుకు వచ్చేవారమని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు శివారు భూముల్లోని పంటల ఉత్పత్తులను మోసుకుని ఇంటికి తెచ్చుకుంటున్నామని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి పంట కాలువల ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేని పక్షంలో పంటలకు నీరందక సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని వారు పేర్కొంటున్నారు.


మల్లేశ్వరంలో కాలువ గట్టుపైనే లే అవుట్‌కు వేసిన రోడ్డు

శివారు ఆయకట్టుకు నీటి ఎద్దడి



కాలువ గట్లు ఆక్రమణల బారిన పడడంతో రాకపోకలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శివారు భూముల రైతులు సాగు నీరందక బోర్లపై ఆధారపడి పంటలు పండించుకోవలసిన దుస్థితి ఏర్పడింది. కాలువ గట్ల దుస్థితి గురించి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు.

– జక్కంశెట్టి సుబ్బారావు, రైతు, కాపవరం

కాలువలు బోదెల్లా మారాయి



ఒకప్పుడు విశాలంగా ఉండే కాలువ గట్లు ఇప్పుడు ఏమైపోయాయో తెలియడం లేదు. ఆక్రమణల వలన కాలువలు నేడు పంట బోదెల్లా మారిపోయాయి. శివారు భూముల పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేందుకు నానా అగచాట్లూ పడుతున్నాం.

– ఈ.కన్నయ్య, రైతు, ఖండవల్లి

ఎడ్లబండ్లపై వెళ్లే వారం



నా బాల్యంలో కాలువ గట్లపై ఎడ్లబండిపై పొలాలకు వెళ్లేవారం. రానురానూ ఆక్రమణలకు గురై గట్లు చిక్కిపోయాయి. ఇప్పుడు సైకిళ్లపై కూడా వెళ్లలేనంత దుస్థితిలో కాలువ గట్లు ఉన్నాయి. దీనినిబట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలి.

– కావకా పాపారావు, రైతు, కాకరపర్రు

క్లుప్తంగా

తాళ్లపూడిలో 100 మందికి వైద్య పరీక్షలు


తాళ్లపూడిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

తాళ్లపూడి: స్థానిక ఆర్యవైశ్య సత్రంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన రాయల్ ఆసుపత్రి, మోహన్ డయాబెటిక్, రమా డెంటల్ ఆస్పత్రి, గౌతమి నేత్రాలయం వైద్యులు, సిబ్బంది కలసి సుమారు 100 మంది రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గోకవరపు బాబులు, కొండూరి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పౌరుడి బ్రహ్మాస్త్రం

నిడదవోలు రూరల్: సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడికీ బ్రహ్మాస్త్రం వంటిదని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. సమాచార హక్కు చట్టం అమలుపై బుధవారం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడికి అధికారులకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. ప్రతి కార్యాలయంలో కచ్చితంగా సమాచారం అందించేలా అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, ఎంఏవో జి.సత్యనారాయణ, సివిల్ సప్లై డీటీ ఎం.అనిల్‌కుమార్, పంచాయతీ, సొసైటీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

2న టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నవంబరు 2న మండలంలోని రామన్నపాలెం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. అండర్ -14,17 విభాగాల్లో జట్ల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ఏ పాఠశాల నుంచి ఎంత మంది విద్యార్థులకు పాల్గొంటున్నారో ఈ నెల 31 గురువారం సాయంత్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్ నంబరు 9701265522, 9441087225కు సమాచారాన్ని వాట్సాప్‌లో పంపించాలని ఆయన తెలిపారు.

నడుపల్లికోటలో పౌర హక్కుల దినోత్సవం

పెరవలి: దళిత వాడల వాసులపై కుల వివక్ష చూపించడం, వారిని వెలి వేయడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి స్పష్టం చేశారు. ఎవరికైనా ఇలాంటి పరిస్థితులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. మండలంలోని నడుపల్లికోటలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో కొందరు ఆర్థికంగా వెనుకబడి ఉండవచ్చని, చట్టం దృష్టిలో మాత్రం అందరూ సమానులేనన్నారు. తమ శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, దాంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ అచ్యుతకుమారి వెంటనే సంబంధిత స్థలాన్ని సర్వే చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. దళితవాడకు వచ్చే తాగునీరు మురికిగా ఉంటోందని స్థానికులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సర్పంచ్ బీరా సత్యవేణిరాజు, ఆర్ఐ పావని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షాపులోని మద్యం, నగదు చోరీ


గోపాలపురంలో మద్యం షాపును పరిశీలిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

గోపాలపురం: స్థానిక హరిహర మద్యం షాపులో దొంగలు పడి రూ.43 వేల విలువైన మద్యాన్ని, నగదును అపహరించుకుపోయారు. స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివార్లలోని ఈ వైన్ షాపు తాళాన్ని మంగళవారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి గునపంతో పగల కొట్టి లోపలికి ప్రవేశించాడు. షాపులో ఉన్న రూ.15,600 నగదు, రూ.27,600 విలువైన మద్యం బాటిళ్లను దొంగిలించుకుపోయాడు. ఈ ఘటనపై షాపు సూపర్‌వైజర్ అడపా ప్రకాశరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీని పరిశీలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే మంగళవారం అర్ధరాత్రి గోపాలపురం షిర్డీ సాయి ఆలయం తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు హుండీ తాళాలు రాకపోవడంతో వెనుతిరిగారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌కుమార్ చెప్పారు.

'ఉమ్మడి పశ్చిమ' బాలికల క్రికెట్ జట్టు ఎంపిక


ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన బాలికలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ -17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో హోరాహోరీగా జరిగాయి. పోటీలను ఎంఈఓలు ఎం. తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. 23 మంది క్రీడాకారిణులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం వారిలో ప్రతిభ గల 16 మంది క్రీడాకారిణులను ఎంపిక చేస్తారు. 12 మంది క్రీడాకారిణులను జట్టుకు ఎంపిక చేసి, ఐదురుగు క్రీడాకారిణులను స్టాండ్ బైలో ఉంచుతామని ఫిజికల్ డైరెక్టర్ ఓరుగంటి నాగరాజు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైౖ క్రీడాకారిణులు ఒ. సాహితీశ్రీ , కె. లీలాసాయి ప్రసన్న, టి.భవ్యశ్రీ , జి.తాస్యశ్రీ , ఐ.జహనవి నాగసాయి, వై. యక్షితమణి, బి. మధుషాలిని, పి.నాగశైలజ, డి. చాందిని, ఎం.తేజశ్రీ , ఎస్.మనీషా, ఎ. రత్నగ్రేస్, ఎం.సౌజన్య, ఎన్. గీతామౌనిక, ఎస్.లాస్య, పి. రిషిక క్రిష్టన్, కె. మణివల్లి, కె. అంజని మల్లి, టీఎస్ఎల్ఎస్ మోక్షజ్ఞ, ఆర్. దేవిశ్రీ, ఐ. సిరిప్రియ, ఆర్. నాగశ్రీ, టి.మనీషారాణి ఎంపికై నట్టు పీడీ నాగరాజు తెలిపారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న జడ్జి వాసుదేవ్


జడ్జి వాసుదేవ్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ వారిని ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్ దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాశ్ ఆధ్వర్యంలో జడ్జి వాసుదేవ్ దంపతులను సన్మానించి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు.

రేపటి నుంచి అస్తవాజపేయ మహాయాగం

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామంలో నవంబర్ ఒకటో తేదీ నుంచి అస్తవాజపేయ మహాయాగం నిర్వహిస్తారు. నెలమూరుకు చెందిన ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యాగం నవంబర్ 15వ తేదీ వరకూ కొనసాగుతుంది. యాగం నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు యాగ నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ బుధవారం తెలిపారు. యాగ ప్రాంగణంలో స్మార్త , శౌత యాగశాలలు నిర్మించామన్నారు. ఈ యాగంలో సుమారు 150 మంది పండితులు పాల్గొంటారని తెలిపారు. రోజూ కుంకుమ పూజలు, దీపోత్సవం, సూర్య నమస్కారాలు, పాశుపత రుద్రాభిషేకాలు, చండీ హోమలు, అన్నదానం నిర్వహిస్తామని వివరించారు. ఈయాగ ప్రారంభోత్సవానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ హాజరవుతారన్నారు.

పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం

- ఎంపీ పురందేశ్వరి ప్రకటన
- బోట్‌లో వెళుతూ కొవ్వూరు పుష్కర ఘాట్‌ల పరిశీలన


బోట్‌లో స్నాన ఘట్టాలు పరిశీలిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: గోదావరి పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రకటించారు. కొవ్వూరు నదీ తీరంలోని పుష్కర ఘాట్‌లను బుధవారం ఆమె బోట్‌లో అధికారులతో కలసి పరిశీలించారు. 2027 పుష్కరాలకు స్నానఘట్టాలతో పాటు చేపట్టే ప్రతి పనీ శాశ్వతంగా ఉండేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రతి స్నానఘట్టం వద్ద సోలార్ విద్యుత్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నూతన స్నానఘట్టాల ఏర్పాటుకు ప్రతిపాదనలు, ప్రస్తుతం ఉన్న స్నానఘట్టాల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి వసతి, వైద్య శిబిరాలు, అంతర్గత రహదారుల నిర్మాణం, బందోబస్తు ఏర్పాట్ల వంటి వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక గోష్పాదక్షేత్రానికి ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఈ క్షేత్రంలో మెరుగైన వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఆర్డీవో రాణిసుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

4న గోదావరి హారతి

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నవంబర్ 4న కొవ్వూరులో నిర్వహించే గోదావరి నది హారతి వేడుకకు హాజరయ్యే భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి హారతి కార్యక్రమంపై ఆర్డీవో రాణి సుస్మితతో కలసి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పని చేయాలన్నారు. కొవ్వూరు మున్సిపాలిటీ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య బాధ్యతలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పట్టణ పోలీసులను ఆదేశించారు. గోదావరి హారతికో ఆర్డినేటర్ రోహిణికుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంతరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నల్లజర్ల విద్యార్థులు


ఖోఖో పోటీలకు ఎంపికైన నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం

నల్లజర్ల: స్కూల్ గేమ్స్ అండర్ -17, అండర్-14 ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. నవంబరు 2 నుంచి 4 వరకూ అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో, నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకూ పల్నాడు జిల్లా కారంపూడిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో వారు పాల్గొంటారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీల అండర్-17 విభాగంలో నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.దుర్గాభవాని, అండర్ -14 విభాగంలో బి.పోసేశ్వరి, పి.భరత్ ప్రతిభ కనబరిచారు. దాంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు ఈ ముగ్గురినీ ఎంపిక చేశారు. ఎంపికై న విద్యార్థులను, పీడీ టి.త్రిపురస్వాతిని పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం కోమలిచిత్ర, విద్యా కమిటీ చైర్మన్ కోడూరి నారాయణరావు తదితరులు అభినందించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు..


బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

దేవరపల్లి: స్కూల్ గేమ్స్ బాల్‌బ్యాడ్మింటన్ అండర్ -14, అండర్-17 జిల్లా జట్లకు దుద్దుకూరు రంగరాయ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 29, 30 తేదీల్లో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. అండర్- 14 విభాగంలో దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.ఆకాష్‌బాబు, ఎస్‌కే అబ్దుల్లా, ఎం.దుర్గాప్రసాద్, ఎ. శ్యామల, వి.షణ్ముఖ ప్రియ, ఎస్‌కే అంజాన్ ఎంపికయ్యారు. అండర్ -17 విభాగంలో టి.మనీషారాణి, ఎన్. గీతామౌనిక ఎంపికయ్యారు. వీరు రాజమహేంద్రవరంలో నవంబరు 9,10 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ రామకుమార్ తెలిపారు.

చిత్తడిగా బాణసంచా విక్రయ ప్రదేశం


నిడదవోలులో వర్షానికి చిత్తడిగా మారిన బాణసంచా షాపుల సముదాయం

నిడదవోలు: ఒక్కసారిగా బుధవారం వాతావరణంలో మార్పు వచ్చి వర్షం కురిసింది. దాంతో కొనుగోలుదారులు లేక బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. పట్టణ శివారు పంగిడి రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్ పక్కనే గల ఖాళీ స్థలంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేశారు. ఇంచుమించుగా గతేడాది ధరలే ఇప్పుడూ ఉన్నాయి. అయినా విక్రయాలు తక్కువగా ఉన్నాయని వ్యాపారాలు చెబుతున్నారు. వర్షం కురవడంతో బాణసంచా దుకాణాల వద్ద ఖాళీ స్థలం అంతా చిత్తడిగా తయారైంది. దీపావళి రోజున కూడా ఇదే విధంగా వర్షం కురిస్తే వ్యాపారాలు జరగక తాము తీవ్రంగా నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు.

వర్షంతో అమ్మకాలకు విఘాతం

దేవరపల్లి: స్థానికంగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలకు వర్షం దెబ్బ తగిలింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో వర్షం పడింది. వర్షాలకు బాణసంచా దుకాణదారులు ఇబ్బంది పడ్డారు. తొలిరోజు బేరాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి. వాతావరణం ఇలాగే ఉంటే నష్టపోతామని వాపోతున్నారు. గతేడాది కంటే లైసెన్సు ఖర్చులతో పాటు పెట్టుబడి పెరిగిందని వివరించారు. గతేడాది కంటే బాణసంచా ధరలు 20 నుంచి 25 శాతం పెరిగినట్టు తెలిపారు. తొలి రోజు బోణీకాని దుకాణాలు చాలా ఉన్నాయని వ్యాపారులు చెప్పారు. దుకాణాల వద్ద ధరలు పేలడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. చిల్లర దుకాణాల్లో బాణసంచా ధరలు ఆకాశాన్ని అంటడంతో పెద్ద కుటుంబాలు, ధనికవర్గాలు పట్టణ ప్రాంతాల్లోని హోల్‌సేల్ దుకాణాలకు వెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేసి బాణసంచా తెచ్చుకుంటున్నారు.

NOTICE

From:
ఓ.ఎన్.కృష్ణ,
అడ్వకేట్, తణుకు

To:
గుడివాడ ముత్తేశ్వరరావు,
తండ్రి: వెంకట లింగం,
కిరాణా బిజినెస్, పెరవలి,
పెరవలి మండలం

నా క్లయింటుఅయిన్నూ పెరవలి గ్రామకాపురస్తులైన (లేటు) కోష్టము కృష్ణమూర్తి గారి కుమారుడు అయిన రాజయ్య గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై మీకు తెలియచేయునది ఏమనగా!

నా క్లయింటుకున్నూ, మీకున్నూ మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు–E.P.No.40/24 in OS No.76/13 అను గ్రంథము నడుచున్నదనిన్నీ, సదరు గ్రంథములో శ్రీ కోర్టు వారు షెడ్యూల్ ఆస్తి అయిన శ్రీ రాజ్యలక్ష్మి ఫోటో స్టూడియో అను షాప్ పై Delivery Order/Warrant ఇచ్చియున్నారనిన్నీ,

అయితే నా క్లయింట్ సదరు E.P.No.40/24 గురించి, సదరు Delivery Warrant వారెంట్ గురించి Hon'ble High Court of A.P., at Amaravathi వారి ముందు C.R.P. దాఖలు చేసియున్నారనిన్నీ, అయితే సదరు Delivery Warrant లో Break open the Lock మరియు Seizure of Property గురించి ఏవిధమైన ఉత్తర్వులు లేకపోయినప్పటికినీ మీరు, Court Amin మరియు పెరవలి A.S.I మరియు వారి Constables కలిసి Shop తాళము బద్దలు కొట్టి, లోపల సామానులు స్వాధీనము చేసుకొనుటయే కాక, సదరు విషయము పెరవలి Main Road మొత్తము డప్పుతో ప్రచారము చేయించినారు. డప్పుతో ప్రచారము చేయమని కూడా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులలో లేదు.

Delivery Warrantలో లేని ఉత్తర్వులు అనగా Break Open Lock, Seizure of Property మరియు డప్పు ప్రచారము చేయుటవలన నా క్లయింటుకు గల పరువు మర్యాదలు మొత్తము పెరవలి గ్రామములో అపఖ్యాతి చెందినవి. నా క్లయింటుకు, అతని కుటుంబసభ్యులకు తీవ్రమైన మనస్తాపము కలిగినది. కావున నా క్లయింట్ రూ.50,00,000/-కు (అక్షరాల యాభై లక్షల రూపాయలు మాత్రమే) మీ మీద అనగా గుడివాడ ముత్తేశ్వరరావు అను మీ మీద పరువు నష్టము దావా దాఖలు చేయుచున్నారనిన్నీ మీకు పత్రికా ముఖముగా ఈ నోటీసు పంపబడమైనది.

నోట్: Shop లోని సామాన్లు, డప్పుల గురించి, సహకరించిన అందరికీ మరియు మీకు కూడా Individual Notices కూడా నా క్లయింట్ Post చేయుచున్నారు.

తణుకు
30.10.2024

ఇట్లు, O.N.Krishna
B.Sc., M.A., M.Com., M.B.A., I.C.S., I.F.S., M.L.,
అడ్వకేట్, మందరపు వారి వీధి,
తణుకు. సెల్: 98481 99440